విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 06, ఆగస్టు 2024

ఇళ్ల పట్టాలిచ్చి, మౌలికి వసతులు కల్పించాలి : సీపీఐ

విశాలాంధ్ర - నంద్యాల : నందికొట్కూరు నియోజకవర్గం పాములపాడు మండలం కొత్త బానుకచెర్ల, పాత బనకచెర్ల, గుండాల నట్టు గ్రామాలకు చెందిన అర్హులైన నిరు పేదలు ఇళ్ల పట్టాలిచ్చి ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.రంగనాయుడు డిమాండ్‌చే శారు. 150 కుటుంబాలు గత కొన్నేళ్లుగా 465/డీ లోని ప్రభుత్వ భూములలో గుడిసెలు నిర్మించుకొని జీవనం కొనసాగిస్తున్నారని, వారికి ఇండ్ల పట్టాలు ఇచ్చి, వీధి కాలువలు, వీధిలైట్లు, రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఆయన కోరారు. సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమ స్యల వేదికలో డిమాండ్లతో కూడిన వినతి పత్రం డీఆర్వో పద్మజకు సమర్పిం చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగ నాయుడుతో పాటు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్, పట్టణ కార్య దర్శి కె.ప్రసాద్, ఆత్మకూరు మండల కార్య దర్శి టి.ప్రతాప్, కొత్తపల్లె మండల కార్యదర్శి వెంకట్ శివుడు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సోమన్న, జిల్లా నాయ కులు వెంకటేశ్వర్లు, సీపీఐ నాయకులు సంజీ వులు, పాత భానకచెర్ల, కొత్త బానుకచెర్ల, గుండాలనట్టు గ్రామ నాయకులు ఏసోబు, ప్రభాకరు, నరసింహ, లక్ష్మీపతి, మహిళా సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షు రాలు మృతుజాబి, మహిళలు లక్ష్మీదేవి సరస్వ తమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్.రంగ నాయుడు మాట్లాడుతూ పాముల పాడు మండలంలోని కొత్త బానకచర్ల, పాత బానక చర్ల, గుండాలనట్టు గ్రామాల్లోని ఇల్లులేని నిరుపేద ప్రజలు గ్రామంలోని ప్రభుత్వ భూమిలో గత కొన్నేల్లుగా 150 మంది కుటుంబాలు సర్వేనెంబర్ 465/డీ లో పూరి గుడిసెలు వేసుకొని నివాసం ఏర్పాటు చేసు కున్నారని, రెవెన్యూ అధికారులు ఆర్డీవో ఆ స్థలాన్ని పరిశీలించి నివసిస్తున్న నిరు పేదలకు పట్టాలిస్తామని హామీ ఇవ్వడం జరి గిందన్నారు. అధికార యంత్రాంగము నేటి వరకు ఆ ప్రాంతాన్ని సందర్శించక ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించక పోవడం విచారకరమన్నారు. జిల్లా రెవెన్యూ అధికార యంత్రాంగం ఆ ప్రాంతాన్ని పరిశీలించి, నిరుపేదలు నివసిస్తున్న నివాస స్థలాలకు పట్టాలివ్వాలని, తాగునీటి సౌకర్యం, రోడ్డు, వీధి కాలువలు, వీధిలైట్లు తదితర మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం : రంగనాయుడు

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్ : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సీపీఐ హర్షం వ్యక్తం చేస్తున్నట్లు జిల్లా సీపీఐ కార్యదర్శి ఎన్.రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాదు, సీపీఐ సీనియర్ నాయకులు సంజీవులు తెలిపారు. సోమవారం పార్టీ కార్యాలయం నందు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించాలని సీపీఐ గత 30 ఏళ్ల నుండి మద్దతు తెలుపుతూ ఉందన్నారు. గతంలో ఏబీ బర్ధన్ సీపీఐ జాతీయ కార్యదర్శిగా ఉన్నప్పుడు జాతీయ సమావేశంలో తీర్మానం చేశారనిగుర్తు చేశారు. సీపీఐ ఎంపీలు సురవరం సుధాకర్ రెడ్డి, గురుదాస్ దాస్ గుప్తా అప్పట్లోనే పార్లమెంటులో ఎస్సీ వర్గీ కరణ అంశాన్ని చర్చించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఎస్సీ వర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందంటూ సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ఫలితంగా జనాభా ప్రతిపాదికన ఎస్సీలకు రిజర్వేషన్లపై రాష్ట్రాలకు అధికారాన్ని కల్పించడానికి సీపీఐ స్వాగతిస్తున్నదని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో బాబు తదితరులు పాల్గొన్నారు.

//: సంక్షిప్త సమాచారం ://

అర్జీలను గడువులోగా పరిష్కరించండి..

విశాలాంధ్ర - వెలుగోడు : స్పందన అర్జీలు, మిగతా సమస్యలు దృష్టికి వచ్చిన వాటిని గడువు లోపల పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్ వీఆర్వోల సమావేశంలో తెలిపారు. వెలుగోడు తాసిల్దారుగా సోమవారము పదవి బాధ్యతలు చేపట్టారు. 2017, 2018లో పూర్తి అదనపు బాధ్యతలతో తహసీల్దారుగా వెలుగోడులో విధులు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యలను రికార్డుల పరంగా తగిన న్యాయం చేస్తానని తెలిపారు.

గ్రామాల్లో పంట నమోదు చేయించుకోవాలి

విశాలాంధ్ర-ఆత్మకూర్ రూరల్ : అత్మకూరు మండలంలోని కురుకుద, శ్రీపతిరావు పేట గ్రామాలలోపంట నమోదు కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు మండలంలోని రైతు సోదరులు ఖరీఫ్‌లో వేసిన పంటను తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి డి.విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. పంట నమోదు చేయించి నట్లయితే విత్తనం వేసినప్పటి నుండి పంట కొత్త వరకు వ్యవసాయ పథకాలైన పంట బీమా పంట నష్టపరిహారం, పంటమద్దతు ధర అన్నదాత సుఖీభవ లాంటి పథకాలు వర్తిస్తాయని తెలపడం జరిగింది.

బాధ్యతలు స్వీకరించిన తహాశీల్దార్

విశాలాంధ్ర -ఉయ్యాలవాడ: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండల తహాశీల్దారుగా ఎం. శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహాశీల్దార్ గా పనిచేస్తున్న వెంకటరమణ ఇటీవల కడప కలెక్టరేట్ కు బదిలీ అయ్యారు. అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం నుండి శ్రీనివాసులు బదిలీపై ఉయ్యాలవాడకు వచ్చారు. ఈ మేరకు ఆయన రెగ్యులర్ తహాశీల్దార్‌గా విధుల్లో చేరారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులపై సంతకాలు చేసి మాట్లాడారు. ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉంటూ కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహాశీల్దార్ తులసికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

రూలర్ సీఐగా బాధ్యతలు చేపట్టిన మంజునాథ్ రెడ్డి

విశాలాంధ్ర - బనగానపల్లె: పట్టణ రూరల్ సీఐగా మంజునాథ్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన సీఐల బదిలీలో భాగంగా ఇక్కడ విధులు నిర్వహించిన గంటా సుబ్బారావు వీఆర్‌కు బదిలీ కావడంతో నంద్యాలలో విధులు నిర్వహిస్తున్న మంజునాథ్ రెడ్డి బనగానపల్లెకు బదిలీ అయ్యారు. సీఐ మంజునాథ్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతల కోసం పని చేస్తానని తెలిపారు.

ఆరోగ్యమే మహాభాగ్యం..

విశాలాంధ్ర -కొవెలకుంట్ల: ప్రజలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే విజయాలు మనకు చేరువవుతాయని డా:చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఏపీ హైకోర్టు వారి ఉత్తర్వుల మేరకు కోవెలకుంట్ల జూనియర్ సివిల్ జడ్జి అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యంలో మండల న్యాయ సేవాదికార సంస్థ వారు హరిబాల ట్రస్టులో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు మాట్లాడుతూ వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు సోకకుండా డాక్టర్ సలహాలు సూచనలు తప్పక పాటించాలని తెలిపారు. ఈ కార్య క్రమంలో కోవెలకుంట్ల డాక్టర్లు చంద్రశేఖర్ రెడ్డి, సృజన, మెడికల్ సిబ్బంది, న్యాయవాదులు నరసింహుడు, తిరుపతయ్య, ఖాసింసాహెబ్, శేఖర్, రాజశేఖర్, నాగశేషు, రమేష్, ఇంద్రకుమార్ పాల్గొన్నారు.

మిడుతూరు తహాశీల్దారుగా శ్రీనివాసులు

విశాలాంధ్ర - మిడుతూరు: మండల కేంద్రమైన మిడుతూరు తహాశీల్దారుగా టి.శ్రీనివాసులు సోమవారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న టి.తులసమ్మ బదిలీపై సొంత జిల్లా అనంతపురం వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన తహాశీల్దారుకు మండల టిడిపి కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, డిప్యూటీ తహాశీల్దారు షేనవాజ్, రీసర్వే డిప్యూటీ తహాశీల్దారు సుప్రియ, సర్వేయర్ కృష్ణుడు ఆర్ఐ మహమ్మద్ భాష వీఆర్వో వెంకటయ్య తదితరులు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తహాశీల్దారు మాట్లాడుతూ రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని, రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రెవెన్యూ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి వాడికి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

విశాలాంధ్ర -కోవెలకుంట్ల: బాల్ బ్యాడ్మింటన్ జిల్లాస్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి సాన్విితా ఎంపికైనట్లు సెయింట్ జోసెఫ్ స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ గీతా సోమవారం తెలిపారు. నంద్యాలలో జరిగిన బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో రాణించి సెప్టెంబర్ మొదటి వారం వైజాగ్ లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పల్గొంటుందని ఆమె తెలిపారు. విద్యార్థిని అభినందిస్తూ రాష్ట్రస్థాయి,జాతీయ స్థాయిలో రాణించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెడ్ మేరీ, ఫిజికల్ డైరెక్టర్స్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

LOSS OF PASSPORT

LOST MY ORIGINAL INDIAN PASS PORT NO. B3235186 DATE 23-02-2000, ISSUED AT HYDERABAD AND EXPIRY DATE 24-02-2010. THE SAID LOST MY PASSPORT WHILE I AM GOING TO SREENIVASA NAGAR TO MALDAR PETA, NANDYAL, DATE 05/02/2024, IF ANY ONE FOUNDED SEND TO SHAIK KHADER BASHA, NANDYAL. CON NO 9440043571.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం

విశాలాంధ్ర - నందికొట్కూరు : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు సీపీఐ జిల్లా నాయకులు రఘురామ్మూర్తి, నందికొట్కూరు పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. సోమవారం పట్టణంలోని స్థానిక సీపీఐ కార్యాలయం నందు విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించాలన్నదే సీపీఐ గతం నుండీ చెబుతోందన్నారు. సీపీఐ జాతీయ స్థాయిలో ఎస్సీ వర్గీకరణ అంశంపై ఏకాభిప్రాయంతో ఉందనీ, ఇన్నేళ్ల ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపట్ల సీపీఐ హర్షం వ్యక్తం చేస్తోందన్నారు. దశాబ్దాల నిరీక్షణ తర్వాత ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు సంచలన తీర్పువెలువరించిందని, 2004లో ఎస్సీ వర్గీకరణపై ఈవీ చిన్నయ్య జడ్జిమెంట్ను సుప్రీంకోర్టు ఏడుగురు న్యాయమూర్తుల విస్తృత రాజ్యాంగ ధర్మాసనం పక్కనపెట్టిందనీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఎస్సీ వర్గీకరణను సమర్థించిందన్నారు. ఒక కులంలో వర్గీకరణను రాజ్యాంగం అనుమతి స్తుందని, సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని, వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు ఉందంటూ తీర్పు వెలువ రించిందని సుప్రీంకోర్టు తీర్పు ఫలితంగా జనాభా ప్రాతిపదికన ఎస్సీలకు రిజర్వేషనుపై రాష్ట్రాలకు అధికారం కల్పించబడడాన్ని సీపీఐ స్వాగతిస్తుందని వారు అన్నారు. ఎస్సీలో వెనుకబడిన అన్ని జాతులకు సంక్షేమ ఫలాలు అందించడమే వర్గీకరణ అని వారు అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు వినోద్, దినేష్, శంకర్ పాల్గొన్నారు.

మాదిగల పోరాటానికి దక్కిన ఫలితం ఎస్సీ వర్గీకరణ

విశాలాంధ్ర - నందికొట్కూరు : కొన్ని సంవత్స రాల పోరాటానికి ఫలితం దక్కిందని, ఎస్సీ వర్గీకరణ ను ఉమ్మడి రాష్ట్రానికి చంద్ర బాబు నాయుడు సీఎంగా ఉన్నప్పుడే చేశారని ఎమ్మా ర్పీఎస్ నాయకులు డాక్టర్ కాటేపోగు రాజు అన్నారు. డా.రాజు ఆధ్వర్యంలో సోమవారం వర్గీకరణను హర్షిస్తూ నందికొట్కూరు పట్టణంలోని స్థానిక పటేల్ సెంటర్ నందు ప్రధాని నరేంద్ర మోడీ, ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, వర్గీకరణ సారథి మందకృష్ణ మాదిగ ఫ్లెక్సీలనందు ఏర్పాటుచేసిన చిత్రపటాలకు పాలాభి షేకం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ మిట్టకందాల స్వాములు, నందికొట్కూరు జనసేన సమన్వయ కమిటీ సభ్యులు మద్దిలేటి, ఉమ్మడి జిల్లా జై మాదిగ సేవా సమితి సోషల్ మీడియా అధ్యక్షులు సంపత్, మాదిగ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఈశ్వరయ్య, గాంధీ, ప్రతాప్, కుమార్ రాజా,మాజీ కౌన్సిలర్ రవణమ్మ, కాటేపోగు నాగ సురేష్, స్వాములు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

విశాలాంధ్ర-నందికొట్కూరు: ప్రతి తల్లి బిడ్డకు జన్మనిచ్చిన గంటలోపు ముర్రు పాలు తాగించాలని, దీంతో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఎలాంటి అంటువ్యాధులు సంభ వించకుండా ఉంటాయని ఐసీడీఎస్ పగిద్యాల మండలం సూపర్ వైజర్ శేషమ్మ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని మూడవ అంగన్ వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భాన్ని పురస్క రించుకుని తల్లిపాల ప్రాముఖ్యతపై పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. బాలింతలకు, గర్భిణీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి పాలలో ముఖ్యమైన పోషకాలు లభిస్తాయని బిడ్డను అనేక రోగాల నుండి సురక్షితంగా ఉంచుతాయన్నారు. తల్లి పాలు ఇవ్వడం వల్ల తల్లి బిడ్డల మధ్య బంధాన్ని పెంపొందిస్తాయన్నారు. ఆరు నెలల పైబడిన శిశువులకు తల్లిపాలతో పాటు అదనపు ఆహారానికి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త సునీత, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన బీసీ ఇందిరమ్మ

విశాలాంధ్ర - బనగాన పల్లె: ఉన్నత చదువులే లక్ష్యంగా విద్యార్థులు ముందు కెళ్లాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబ డులు, మౌలిక సదుపా యాలశాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిర రెడ్డి ఆకాం క్షించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమంలో బీసీ ఇందిర రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులకు కళాశాలలో అందుతున్న సౌకర్యాలు, అవసరాలపై ఆరా తీశారు. అనంతరం నిర్వహించిన సభలో ఇంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ అమూల్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు రాయల సీమ సలాం, రిటైర్డ్ హెడ్మాస్టర్ ఫకీర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ రాజిక సత్య ప్రపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు గంగ ప్రధాన కాలువ పరిశీలన

విశాలాంధ్ర - చాగలమర్రి : మండల పరిధిలోని తెలుగు గంగ ప్రధాన కాలువను తెలుగు గంగా ఈఈలు శివ శంకర్ రెడ్డి పరిశీ లించారు. సోమవారం తెలుగు గంగ ప్రధాన కాలువ 58 కి.మీ నుండి 96.130 కిమీ వరకు 28వ బ్లాక్ నుండి 37వ బ్లాక్ వరకు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 58 కిమీ వద్ద 2648 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందన్నారు. తెలుగుగంగ ప్రాజెక్ట్ ఆయకట్టు పరిధిలో వార బంది విధానంలో సాగు నీరు విడుదల చేస్తామని తెలిపారు. వారబంది విధానంలో సాగు నీరు విడుదల బ్లాక్‌ల వారీగా విభజించి వారం విడిచి వారం సాగు నీరు అందిస్తామని తెలిపారు. నంద్యాల, కడప జిల్లా సరిహద్దు వద్ద ఈఈ శివశంకర్ రెడ్డి, పోరుమామిళ్ల ఈఈ కృష్ణారెడ్డితో కలిసి నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తెలుగు గంగ డీఈఈ వెంకటరమణ, ఏఈఈలు మహమ్మద్ సలీం, నియాజ్ అహ్మద్, వినయ్ కుమార్, పోరుమామిళ్ళ డివిజన్ ఏఈలు నాగిరెడ్డి, అనితా, రామ్ మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆ జీవోను రద్దు చేయాలి : ఏపీ రైతు సంఘం డిమాండ్

విశాలాంధ్ర - నంద్యాల : రాష్ట్రానికి ఉరి తాడుగా మారిన జీవో నెం.4375/ఈ ను రద్దు చేయా లని ఏపీ రైతు సంఘం నాయ కులు డిమాండ్ చేశారు. గోదావరి నది జలాల సమస్యను విశ్లేషించి రాష్ట్ర నీటి హక్కులను కాపాడాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వోకు ఆంధ్రప్రదేశ్ సాగునీటి హక్కులకు వివాదం కలిగించే దిశగా కేంద్ర నోటిఫికేషన్ రద్దు చేయాలని, ముఖ్యమంత్రి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి తగు నిర్ణయాలు తీసుకోవలసినదిగా ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి జి.సోమన్న, జిల్లా కౌన్సిల్ నాయకులు విక్కిలి వెంకటేశ్వర్లు, భాస్కర్ సంజీవుడు, సుబ్బారెడ్డి, వెంకటశివుడులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నోటిఫికేషన్ ఎస్ఓ4375ఈ, 6/10123, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటి హక్కులపై తీవ్రమైన ప్రతికూల పరిస్థితులను కలగజేసిందని, ఈ నోటిఫికేషన్ ద్వారా కొత్తగా చేర్చిన అంశాలు తీసుకొని బ్రజేష్ కుమార్ కమిటీ చేపడుతున్న విచారణ ప్రమాద ఘటికలు మోగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - వెలుగోడు : తెలుగంగ ప్రాజెక్టులో భాగమైన ఎన్టీఆర్ జలాశయం స్పిల్ వే గేట్ల నుంచి గాలేరుకు మంగళ వారం లేదా బుధ వారం తెలుగు గంగ అధికారులు నీటి విడుదల చేయడానికి అధికారులు సమాయ త్తమవుతున్నారు. గాలేరుకు నీటి విడుదల చేస్తున్నందువల్ల సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలుగంగ అధికారులు కోరుతున్నారు. రిజర్వాయర్లో పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 264.70 మీటర్ల వద్ద 16.95 టీఎంసీలు కాగా, ప్రస్తుతము రిజర్వాయర్లో 260.5 9 మీటర్ల వద్ద 10.62 టీఎంసీల నీరు నిల్వ ఉంది. బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింక్ చానల్ ద్వారా రిజర్వాయర్లోకి 16.700 క్యూసెక్కుల నీరు వస్తుండగా, రిజర్వాయర్ నుంచి బయటకు 5,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఆళ్లగడ్డ రూరల్ సీఐగా కంబగిరి రాముడు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ రూరల్ సీఐగా కంబగిరి రాముడు సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ సీఐగా పని చేసిన హనుమంత నాయక్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్రొద్దుటూరులో ఫ్యాక్షన్ జోన్ సీఐగా ఉన్న కంబగిరి రాముడును ఆళ్లగడ్డలో నియామకం చేస్తూ కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రూరల్ సీఐగా ఆయన పదవి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డ రూరల్ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తమవంతు కృషి చేస్తామని తెలిపారు.

పని దినాలు కల్పించాలి



విశాలాంధ్ర - చాగలమర్రి : గ్రామాల్లో హౌసింగ్ పరిధిలో ప్రతి ఒక్కరికి 90 రోజుల పని దినాలు కల్పిం చాలని ఉపాధి ఏపీడీ సాంబశివరావు తెలి పారు. పట్టణంలోని మండల పరిషత్ సమా వేశ భవనంలో సోమవారం ఉపాధి సిబ్బంది, హౌసింగ్ సిబ్బంది, ఇంజినీరింగు అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ హౌసింగ్ పరిధిలో ఉపాధి పథకంలో కల్పించే 90 రోజుల పనిదినాలు తప్పనిసరిగా కల్పించాలని తెలిపారు. ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, ఏఈ పవివుల్లా, ఏపీవో నిర్మల, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

విశాలాంధ్ర - మహానంది: మండలం అబ్బీపురం గ్రామ గిరిజన కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సోమవారం సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. గత 15 ఏళ్లుగా 42 గిరిజన కుటుంబాలు ప్రభుత్వం భూముల్లో నివా సాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తుంటే గిరిజ నులకు అధికార యంత్రాంగం పట్టాలి ఇచ్చిన మౌలిక వసతులు కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందారు. గత కొన్నేళ్లుగా అధికారులకు ఎన్నోసార్లు వినతిపత్రం ఇచ్చిన ఫలితం లేకపోవడంతో సీపీఐ మహానంది మండల సమితి ఆధ్వర్యంలో 42 కుటుంబాల గిరిజనులతో తిమ్మాపురం ఉన్న ఎంపీడీవో కార్యాలయం ముట్టడి చేశారు. ఎంపీడీవో కార్యా లయ సిబ్బందిని మండల అధికారులను బయటికి పంపించి కార్యాలయానికి తాళాలు వేసి ముట్టడి చేశారు. ఈ సందర్భంగా రంగనాయుడు మాట్లా డుతూ సీపీఐ ఆధ్వర్యంలో గత 15 ఏళ్ల కిందట ప్రభుత్వ భూమిలో 42 కుటుంబాల గిరిజనులతో కలిసి భూ పోరాటాల ద్వారా గుడిసెలు వేసుకోవడం జరిగిందని, స్థానిక ప్రభుత్వాలు గుర్తించి వారికి ఇండ్ల పట్టాలు ఇచ్చినా ఇండ్ల నిర్మాణాలు, వీధిలైట్లు తదితర మౌలిక సదూపాయాలు కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్, మండల సహాయ కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు. ఆత్మకూరు మండల కార్యదర్శి టి.ప్రతాప్, గ్రామ గిరిజనులు, లక్ష్మయ్య, శ్రీని వాసులు, అంజి మహిళలు, లక్ష్మమ్మ, చెంచుదేవి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొత్త సీఐకి సమస్యల స్వాగతలు..

● మండలంలో పెరిగిన రాజకీయ ఉద్రిక్తతలు, దాడులు జోరందుకున్న మట్కా సారా అమ్మకాలు

విశాలాంధ్ర - కొలిమి గుండ్ల : కొలిమిగుండ్ల యూపీఎస్ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా బాధ్యతలు చేపట్ట బోతున్న రమేష్ బాబుకు మండ లంలో నెలకొన్న సమస్యలు స్వాగతం పలుకు తున్నాయి. అసాంఘిక కార్యక్రమాలు, రాజ కీయ విభేదాలతో దాడులు, ఉద్రిక్తతలు శాంతి భద్రతలకు సవాల్ విసురుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఆయా గ్రామాల్లో జరిగిన దాడులను స్థానిక పోలీసులు సకాలంలో నివారించలేక పోయారని ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వ హయంలో వచ్చిన పోలీసు అధికారులను కూటమి ప్రభుత్వం బదిలీ చేస్తుందన్న ప్రచారం జరగడంతో శాంతి భద్రతలపై పెద్దగా దృష్టి సారించకపోవడంతో గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు పెరిగినట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. పలు గ్రామాలలో సారా అమ్మకాలు జోరందుకోవడంతో పాటు, కనుమరుగైంద నుకున్న మట్కా సైతం ప్రజల ముందుకు వచ్చే సింది. పలు గ్రామాల్లో సారాను డోర్ డెలివరీగా అందిస్తున్నట్లు ఆరోపణ వెలు వెత్తుతున్నాయి. మట్కా అక్రమ సారా, బెల్ట్ షాపులపై ఆధిపత్యం కోసం నాయకుల మధ్య పోరు సాగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతున్నది. అధికార పార్టీ నాయకుల మధ్య అధిపత్య పోరు సాగుతుండడంతో ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు రెండుగా చీలిపోయినట్లు ప్రచారం జరుగుతున్నది. నూతనంగా బాధ్యతలు చేపట్టబోతున్న సీఐ అసాంఘిక కార్యకలాపాలపై దృష్టిసారించి కట్టడి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఉన్నత స్థాయికి ఎదిగేల ప్రసన్నకు ప్రోత్సాహం : ఎమ్మెల్యే అఖిలప్రియ

విశాలాంధ్ర - చాగలమర్రి : బాగా చదువుకొని అందరికి సాయం అందించేలా ఉన్నత స్థాయికి ఎదిగే వరకు ప్రసన్నకు ప్రోత్సాహం అందిస్తామని ఎమ్మెల్యే అఖిల ప్రియ అన్నారు. సోమవారం చిన్నవంగలి గ్రామంలో మిద్దెకూలి మృతి చెందిన బాధిత కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన రూ.10 లక్షలు బాధితురాలు ప్రసన్నకు, సంరక్షకురాలు సుబ్బమ్మకు రూ.2 లక్షల చెక్కులను నంద్యాల ఆర్‌డీఓ మల్లికార్జున రెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను కోల్పోయి ఒంటరిగా మిగిలిన ప్రసన్నను అక్కున చేర్చుకున్నారు. అన్ని విధాల అక్కలా తోడుగా ఉంటానని ఎమ్మెల్యే ఆ చిన్నారికి భరోసానిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మట్టి మిద్దె కూలి ఒకే కుటుంబంలోని నలుగురు మృతి చెందిన సంఘటన ఏంతో కలిచి వేసిందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఐటీ మంత్రి నారాలోకేష్‌తో ఈ పాప చదువు గురించి మాట్లాడం జరిగిందని, ఖచ్చితంగా ఆ పాప ఎంత వరకు చదివిన ఎన్టీఆర్ స్కూల్‌లోనే చదివిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. పాప చదువు బాధ్యతే కాకుండా పెళ్లి అయ్యే వరకు తాను తోడుగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎక్కడైనా పాత పడిన మట్టి మిద్దెలు ఉంటే అధికారులకు తెలియజేయాలని ఎమ్మెల్యే కోరారు. అధికారులు ఈ విషయంపై తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఆర్డిఓ మల్లికార్జున్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ విజయ్ కుమార్, టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు అన్సర్ బాష, మండల కన్వీనర్ లాయర్ నరసింహా రెడ్డి, టీడీపీ నాయకులు లక్ష్మీకాంత్ రెడ్డి, నరేంద్ర రెడ్డి, గురు శేఖర్ రెడ్డి, సంజీవరెడ్డి, నర్సిరెడ్డి, శివరామిరెడ్డి, లక్ష్మి నారాయణరెడ్డి, కొలిమి హుసేన్ వలి, మౌలాలి, హనీఫ్, సల్లా నాగరాజు, జెట్టి నాగరాజు, నరసింహారెడ్డి, బ్రహ్మం, శగ్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 06,ఆగస్టు 2024

పార్వతి ఆత్మహత్యపై పూర్తి విచారణ జరిపించాలి-ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-మంత్రాలయం: సుంకేశ్వరికి చెందిన పదోతరగతి విద్యార్థిని పార్వతి ఆత్మహత్యకు గల కారణాలు తెలుసుకొని నిందితులను కఠినంగా శిక్షించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి థామస్ డిమాండ్ చేశారు.సోమవారం లచ్చుమర్రిమోడల్ స్కూల్లో పదోతరగతి చదువుతున్న పార్వతి హాస్టల్లో ఉరివేసుకొని చనిపోవడంతో అక్కడికి చేరుకున్న విద్యార్థి నాయకులు రోడ్లపై బైఠాయించి పార్వతి న్యాయం చేయాలని దాదాపు గంటసేపు రాస్తారోకో నిర్వహించారు. అనంతరం అక్కడికి చేరుకున్నటువంటి సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ విద్యార్థి నాయకులతో మాట్లాడి విద్యార్థి నాయకులతో మాట్లాడి విద్యార్థినికి తగినన్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థి నాయకులు విద్యార్థులు కుటుంబానికి రూ.20 లక్షలు ఎక్‌గ్రేషియా కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా భారీధర్నా నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. అక్కడికి చేరుకున్న రాజకీయ నాయకులతో మాట్లాడి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరడంతో విద్యార్థి నాయకులు శాంతించి విద్యార్థిని మృతదేహం వెళ్లేంత వరకు అక్కడే ఉండి కుటుంబానికి అండగా నిలిచారు. హాస్టల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు, భద్రత కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి థామస్ వై. ప్రదీప్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు.

టీడీపీ నేతల దిగ్భ్రాంతి : పార్వతి ఆత్మహత్య చేసుకున్న మంత్రాలయం టీడీపీ యువ నాయకులు ఎన్.రామకృష్ణారెడ్డి,సబ్‌కలెక్టర్ శివ నారాయణ శర్మ మంత్రాలయం, ఎమ్మిగనూరు సీఐలు సుదర్శన్ రామాంజినేయులు మంత్రాలయం మరియు మాధవరం సబ్ ఇన్స్పెక్టర్స్ ఎన్ రామకృష్ణ రెడ్డి పరామర్శించారు. పార్వతి ఆత్మహత్య లేదా హత్య అనే కోణంలో వేగంగా దర్యాప్తు చేయాలని అధికారులకు సూచించారు. పార్వతి కుటుంబ సభ్యుల దగ్గర మాట్లాడుతూ చెబుతూ న్యాయం చేసే బాధ్యత మంత్రాలయం టీడీపీ ఇంచార్జ్ ఎన్.రాఘవేంద్రరెడ్డి తీసుకుంటారని కుటుంబసభ్యులకు ఓదార్చారు.

వైసీపీ నేతల పరామర్శ : పదో తరగతి విద్యార్థిని పార్వతి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి దృష్టికి వెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు వైసీపీ నేతలు వై. ప్రదీప్‌రెడ్డి జి.భీమారెడ్డి హాస్టల్ వద్దకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి ఆత్మహత్యకు గల కారణాలను పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మను కోరారు. అనంతరం పార్వతి సమీప బంధువులకు తక్షణ సాయం కింద రూ.10 వేల నగదును అందజేశారు.

వరద బాధితులకు చేయూతనిద్దాం...!

విశాలాంధ్ర-పత్తికొండ: కేరళ రాష్ట్రంలోని వయనాడు వరద బాధితులకు చేయూతనిద్దామని సీపీఐ మండల కార్యదర్శి డి. రాజాసాహెబ్ పిలుపునిచ్చారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో వయనాడు వరద బాధితులకు చేయూతనిద్దామని కోరుతూ పట్టణంలోని పలు వ్యాపార సముదాయ దుకాణాల దగ్గరికి వెళ్లి ప్రజల నుంచి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల కారణంగా కేరళ రాష్ట్రంలోని వయనాడు జిల్లాలో వరదలు సంభవించి, కొండచరియలు విరిగిపడి వందలాదిమంది మృతి చెందగా, వేలాదిమంది నిరాశ్రయులయ్యారని తెలిపారు. ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా విరాళాలు అందించి వయనాడు వరద బాధితులకు అండగా నిలుద్దామన్నారు. సీపీఐ తుగ్గలి మండల కార్యదర్శి సుల్తాన్, జిల్లా సమితి సభ్యులు పెద్దఈరన్న, కొత్తపల్లి, వందికోన సీపీఐశాఖ కార్యదర్శులు గిద్దయ్యగౌడ్, జోహారాపురం కాశి, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు నెట్టికంటయ్య, నాయకులు మాదన్న, రాజప్ప, మద్దిలేటి, ఉరుకుందు, శంకర్‌లు పాల్గొన్నారు.

విద్యార్థి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి-ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి

విశాలాంధ్ర-కోడుమూరు:మండల కేంద్రమైన కోడుమూరు ఉన్నత విద్యను అభ్యసించడానికి పోతుగల్లు,గుండ్ల మల్లాపురం తదితర గ్రామాల నుండి మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామం మీదుగా వచ్చే విద్యార్థిని,విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రంగస్వామి కోరారు.ఈ మేరకు ఆయన సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల నుంచి వచ్చే విద్యార్థినిలతో కలసి మండల తహశీల్దార్ వెంకటేష్ నాయక్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బి రంగస్వామి మాట్లాడుతూ కోడుమూరు మండలంలోని కృష్ణాపురం గ్రామం నుండి మండల కేంద్రానికి పాఠశాలలు,కళాశాలకు ఉన్నత చదువులు చదువుకోవడానికి ప్రతిరోజు దాదాపు 120మందికి పైగా విద్యార్థులు వెళ్తున్నారన్నారు.కృష్ణాపురం గ్రామానికి రోడ్డు రహదారి మార్గాలు బాగున్న కానీ,విద్యార్థులు చదువు కోసం రావడానికి చాలా అవస్థలు పడి వస్తారన్నారు.కొంతమంది బైకుపైన,మరి కొంతమంది నడుచుకుంటూ,ఆటోలో ప్రయాణిస్తూ ఉన్నత చదువులను చదువుకుంటున్నారని చెప్పారు.రోడ్డు మార్గంలో బస్సు రావడానికి నూతనంగా రోడ్డు కూడా వేశారని,ఆ గ్రామాల విద్యార్థులకు బస్సుసౌకర్యం కల్పించాలని సూచించారు.లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల కలుపుకొని ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ వినతిపత్రం అందించిన వారిలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు వీరంజినేయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టు రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యం..!

విశాలాంధ్ర -చిప్పగిరి: ఆలూరు బ్రాంచ్ కెనాల్ ఆయకట్టు రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని ఆ పార్టీ మండల కన్వీనర్ షేక్షావలి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఏరూరులో షేక్షావలి ఆధ్వర్యంలో మండల సీనియర్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకులు కోనంకి మహేష్, రామదుర్గం తిమ్మయ్య మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో నియోజకవర్గాభివృద్ధికి నోచుకోక ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. చిప్పగిరి మండల పరిధిలోని హంద్రీనీవా కాలవకు తూము ఏర్పాటు చేసి ఆలూరు బ్రాంచ్ కెనాల్ ఆయకట్టు రైతులకు సాగు నీరు తో పాటు మండల ప్రజలకు తాగునీరు అందించడమే లక్ష్యంగా నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి వీరభద్ర గౌడ్ ఆధ్వర్యం లో సాధిస్తామన్నారు. ఈకార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు రవి కుమార్ యాదవ్, పోతురాజు రాముడు, గుమ్మనూరు అంపయ్య, కొండా గోవిందు, శ్రీ లక్ష్మీ, సన్నప్ప, ఓబయ్య, చంద్రశేఖర్ రెడ్డి, పులికొండ తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ అర్బన్ సీఐగా జయన్న

విశాలాంధ్ర-పత్తికొండ:పత్తికొండ అర్బన్ సీఐగా ఏ జయన్న సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ అధ్యక్షులు ఎం. సాలురంగడు, గౌరవ అధ్యక్షులు రంగన్నతో పాటు ముఖ్య నాయకులు నూతన సీఐ జయన్నను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని, మీడియా మిత్రులు తమ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే టోల్ ఫ్రీ నెంబర్ 1930 కు డయల్ చేయాలని సూచించారు. ఏపీయూడబ్ల్యూజే నాయకులు హనుమంతు, లక్ష్మీనారాయణ, గోపాల్, షేక్షావలి, తాజ్‌మహమ్మద్, నాగేశ్వరరావు, బద్రీనాథ్, జాఫర్‌లు పాల్గొన్నారు.

అనుమానస్పదంగా వ్యక్తి మృతి

విశాలాంధ్ర-ఆస్పరి:అనుమానస్పదంగా వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం ఆస్పరిలో చోటు చేసుకుంది. సీఐ హనుమంతప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఆస్పరికి చెందిన కావలి చిన్న నరసన్న (52) అనే వ్యక్తి ఇంటి నుండి బయటకు వెళ్ళాడు.చుట్టుపక్కలవెతికారు. నరసన్న ఆచూకీ ఎక్కడ లభించలేదు. సోమవారం పొలాల్లో అనుమానాస్పదంగా మృతి చెందిన చిన్న నరసన్న మృతదేహం కనిపించింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పదంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

న్యాయవాదులు విధులు బహిష్కరణ

విశాలాంధ్ర-కర్నూలు ఎడ్యుకేషన్ : కర్నూలు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు విధులు బహిష్కరించినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బిఎస్‌రవికాంత్ ప్రసాద్‌లు తెలిపారు. సోమవారం వారు పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ఆళ్లగడ్డ ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాది వి.సుబ్బారామిరెడ్డి సివిల్ పంచాయతీలో నంద్యాల టూ టౌన్ సీఐ రాజారెడ్డి న్యాయవాది చొక్కా పట్టుకొని న్యాయవాది పట్ల దురుసుగా మాట్లాడడం జరిగిందన్నారు. న్యాయవాదులు జిల్లా వ్యాప్తంగా విధులు బహిష్కరిస్తున్నట్లు వారు తెలిపారు. నందికొట్కూరు న్యాయవాది శశిధర్ సివిల్ పంచాయతీలో అల్లంపూర్ ఎస్సై అక్రమంగా కేసు పెట్టి రిమాండ్ పంపడం జరిగిందన్నారు. న్యాయవాదులు విధులు బహిష్కరించి సంబంధిత అధికారులకు పోలీస్ అథారిటీ కమిషన్కు ఫిర్యాదు చేస్తామని వారు తెలియజేశారు.సివిల్ కేసుల్లో పోలీసుల జోక్యం ఉండకూడదని గతంలో రెండు రాష్ట్రాల హైకోర్టు చెప్పడం జరిగిందన్నారు. పోలీసుల జోక్యం అరికట్టాలని వారు డిమాండ్ చేశారు. న్యాయవాదులపై దాడులకు పాల్పడకుండా ప్రొటెక్షన్ చట్టాన్ని తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు నిత్యజీవన్ రాజ్, దస్తగిరి,రాజేష్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

నదీజలాల నీటి వాటాలు పరిశీలించాలి-ఏపీ రైతుసంఘం

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: ఏపీరైతు సంఘం ఆధ్వర్యంలో కృష్ణ,గోదావరి నదీజలాల నీటి వాటాల హక్కులను పునఃపరిశీలన చేయాలని కోరుతూ ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.పంపన్నగౌడ్ కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి కే.తిమ్మయ్యలు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీలో గోదావరి,కృష్ణా నది జలాల నీటి వాటాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి రావలసిన నీటి హక్కుల గురించి బ్రిజేష్ ట్రిబ్యునల్ ముందు వాదనలు రాష్ట్ర ప్రభుత్వం విన్నవించవలసిన అవసరం ఉందన్నారు. కానీ గత ప్రభుత్వం కేంద్ర జల సంఘం ముందు వాదనలు వినిపించకుండా నిర్లక్ష్యం చేసిందని ఇప్పుడున్న ప్రభుత్వం మేల్కొని ఆగస్టు రెండోవారం లోపల బ్రిజేష్ ట్రిబ్యునల్ ముందు రాష్ట్ర ప్రభుత్వం గోదావరి,కృష్ణ నదీ జలాల నుంచి రావలసిన నీటి హక్కులను రాబట్టడం కోసం తమ వాదనలు వినిపించి రాష్ట్రానికి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. గోదావరి,కృష్ణా నదిజలాల పంపిణీ విషయంలో నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతుందని, తక్షణమే మేల్కొనాలని వారు తెలిపారు. అదేవిధంగా ఎగువ తెలంగాణ రాష్ట్రం ఎలాంటి అనుమతులు లేకుండా పాలమూరు, రంగారెడ్డి ఎత్తి పోతల పథకము దిండి ప్రాజెక్టు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకము మొదలైన ప్రాజెక్టులు నిర్మించ తలచింది కావున వాటి వల్ల ఆంధ్ర రాష్ట్రానికి జరిగే అనార్థాలను ట్రిబ్యునల్ ముందు చెప్పాలని వారు తెలిపారు. అదేవిధంగా జిల్లాలో పెండింగ్లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు గుండ్రేవుల, వేదవతి ఆర్డీఎస్ అదేవిధంగా హంద్రీ వివా పంట కాలువల నిర్మాణం పనులు పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు జిల్లా సమితిసభ్యులు సురేంద్ర యాదవ్,రబియా తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం సప్త భజనలు

విశాలాంధ్ర-పెద్దకడబూరు : మండల పరిధిలోని చిన్న కడబూరులో వెలసిన శ్రీశ్రీశ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సోమవారం వర్షం కోసం సప్తభజనలు చేశారు. ముందుగా శ్రీఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ ఆవరణంలో అర్చకులు రైతులు సాగు చేసిన పంటలు వర్షం లేక ఎండిపోతున్నాయని, వర్షం కురిపించి పంటలను కాపాడాలని సప్త భజనలతో వేడుకున్నారు. అలాగే పెద్దకడబూరు గ్రామంలో వెలసిన శ్రీ మల్లికార్జునస్వామి దేవాలయంలో వర్షాన్ని ప్రసాదించాలని స్వామివారికి పదకొండు మంది చిన్నారులు ఒక్కొక్కరు 108 బిందెలు నీళ్లు తెచ్చి మహా శివలింగానికి జలాభిషేకం నిర్వహించి వర్షాన్ని అనుగ్రహించాలని వేడుకున్నారు.

బకాయి పడిన జీతాలు చెల్లించాలి..ఏఐటీయూసీ

విశాలాంధ్ర-కర్నూలు: కోడుమూరు పంచాయతీ స్వచ్ఛభారత్ కార్మికులకు బకాయి పడ్డ మూడు నెలల జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట వారు ధర్నా నిర్వహించారు.ఈధర్నా నుద్దేశించి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మునెప్ప మాట్లాడుతూ కార్మికుల జీతాలు రూ.6 వేల నుండి రూ.10 వేలకు పెంచాలన్నారు. స్వచ్ఛభారత్ కార్మికులకు మూడో నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో కార్మికుల కుటుంబాలు గడవక ఎన్నో ఆర్థిక మద్దతు గురవుతున్నారన్నారు. జీతాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. స్వచ్ఛభారత్ కార్మికులకు ఇస్తున్న నెలకు రూ. 6 వేలు వేతనం ఏ మాత్రం సరిపో వడం లేదన్నారు. వీరితోపాటు పని చేస్తున్నటువంటి పంచాయతీ వర్కర్లకు రూ.10 వేల చెల్లిస్తున్నారన్నారు. ఇద్దరూ ఒకేరకమైన పని చేస్తున్నప్పటికీ స్వచ్ఛ భారత్ కార్మికులకు తక్కువ జీతాలు ఇవ్వడంతో వారు ఎంతో మనోవేదనగురవుతున్నారని స్వచ్ఛ భారత్ కార్మికులకు కూడా రూ.10వేల వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.జిల్లాలోని పంచాయతీలో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు 5 నెలల నుండి 10 నెలల జీతాలు పెండింగ్లో ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం నుండి పంచాయతీలకు నిధులు ఇచ్చినప్పటికీ స్వచ్ఛభారత్ కార్మికుల జీతాలు చెల్లింపు విషయంలో సర్పంచులు పంచాయితీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జిల్లాలో ఉన్నటువంటి స్వచ్ఛభారత్ కార్మికులందరికీ జీతాలు చెల్లించేందుకు కలెక్టర్ చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో కోడుమూరు ఏఐటీయూసీ అధ్యక్షులు మధు, నాయకులు బతకన్నా, కృష్ణ, రాముడు, సురేఖ, దేవమణి, తదితరులు పాల్గొన్నారు.

గోసేవ ఎంతో గొప్పది.. మంత్రి టి.జి.భరత్

కర్నూలులో నగర శివారుల్లోని గోమాత సన్నిధిలో మంత్రి టి.జి.జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-కర్నూలు సిటీ: గోమాతకు సేవ చేస్తే అంతా మంచి జరుగుతుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ చెప్పారు. కర్నూలు నగర శివారులోని డోన్ రోడ్డులోని గాయత్రీ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గాయత్రీ గోశాలలో మంత్రి టి.జి భరత్ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. తన తండ్రి, మాజీ రాజ్యసభ సభ్యులు టి.జి వెంకటేష్‌తో పాటు కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత చండీ హోమం, ఆయుష్ హోమం చేశారు. అనంతరం గోవులకు గ్రాసం పెట్టారు. ఈసందర్భంగా మంత్రి టి.జి భరత్ మాట్లాడుతూ జన్మదిన వేడుకలు, ఇతర శుభకార్యాల సమయంలో గోసేవ చేయడం అలవాటు చేసుకోవాలని చెప్పారు. గోవుకి ప్రదక్షిణం చేస్తే సాక్షాత్తు 33 కోట్ల దేవతలకు ప్రదక్షిణం చేసినట్లేనని పురాణాలు చెబుతున్నాయని తెలిపారు. గోసేవ చేయడం వల్ల ఎన్నో జన్మల పాపాలు నశిస్తాయన్నారు. పవిత్రమైన గోశాలను ప్రతి ఒక్కరూ సందర్శించాలని మంత్రి టి.జి భరత్ పిలుపునిచ్చారు. అంతకుముందు మంత్రి నివాసంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, సోమిశెట్టి నవీన్, తదితరులు మంత్రి టీజీ భరత్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి టి.జి.జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు

రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన అభిమానులు, పార్టీ నాయకులు సేవా కార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టారు. తన జన్మదినం సందర్భంగా బొకేలు, శాలువాలు తీసుకురావద్దని మంత్రి టి.జి భరత్ అభిమానులు, పార్టీ నాయకులకు ముందుగానే విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసేందుకు వచ్చిన వారు గోవులకు గ్రాసం, పండ్లు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా గాయత్రీ గోశాలలో లక్కీ-2 యూత్ గోపీనాథ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం చేసిన వారందరినీ మంత్రి టి.జి.భరత్ అభినందించి పండ్లు అందజేశారు. అనంతరం ఆయన అభిమానులు ఏర్పాటు చేసిన చీరల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.టి.జి భరత్‌కు శుభాకాంక్షలు తెలియ జేసేందుకు వచ్చిన సందర్భంగా పలువురు తమకు తోచినంత విరాళాలు అందజేశారు. గోవులకు గ్రాసం, ధాన్యం, కూరగాయలు అందించారు. అనంతరం కర్నూలు నగరంలోని మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా మహిళా ప్రాంగణంలో టిడిపి వీరశైవ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ శివరాజు ఆధ్వర్యంలో నాయకులు మొక్కలు నాటారు. దీంతో పాటు నగరంలోని ధర్మపేట, అరుంధతి నగర్‌లోని వెయ్యి మందికి టిడిపి నేతలు లంచ్ బాక్సులు పంపిణీ చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో టి.జి భరత్ అభిమానులు, టిడిపి నేతలు మొక్కలు నాటారు.

ఎమ్మిగనూరులో తిష్ఠ వేసిన సమస్యలు పరిష్కరించాలి-సీపీఐ డిమాండ్

విశాలాంధ్ర-ఎమ్మిగనూరు:ఎమ్మిగనూరు పట్టణంలో తిష్ఠ వేసిన సమస్యల పరిష్కారానికి పాలకులు, అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గోనెగండ్ల రోడ్డు సున్నబట్టి సమీపంలోని మహిళల పబ్లిక్ మరుగుదొడ్డి మలం డ్రైనేజ్ పైపు ను ఏర్పాటు చేయడంలో మున్సిపల్ అధికారులు వైఫల్యం చెందారని,డ్రైనేజీ పైపు లేక బయటకు వస్తున్న మలం దుర్వాసనతో కాలనీ ప్రజలు బెంబేలు ఎత్తుతున్నారని,పైగా అనారోగ్య పాలవుతున్నారని, కాబట్టి తక్షణమ మున్సిపల్ అధికారులు స్పందించి పబ్లిక్ మహిళల మరుగుదొడ్డికి మలం డ్రైనేజ్ పైపును ఏర్పాటు చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో కాలనీ ప్రజలతో వెళ్లి పరిశీలించడం జరిగిందని సీపీఐ పట్టణ కార్యదర్శి జి. రంగన్న, పట్టణ సహాయ కార్యదర్శి సమీవుల్లా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు పబ్లిక్ మరుగుదొడ్డి నిర్మించడం మంచిదే, వాటి శుభ్రతపై కూడా మున్సిపల్ అధికారులు దృష్టి పెట్టాలని నిర్మించే చేతులు దులుపుకుంటే సమస్యలు వస్తాయని వారు తెలిపారు. డ్రైనేజ్ పైపు దెబ్బతిని ఏడాది కాలం గడుస్తుందన్నారు. తద్వారా ఆ దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,కాలనీ ప్రజలు ఈ సమస్యను ఎన్నోసార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వారు పట్టించుకునే పాపాన పోలేదని,నిత్యమా దుర్వాసనను భరిస్తూ కాలనీ ప్రజలకు నానా రోగాలతో హాస్పిటల్ పాలు కావడం జరుగుతుందని ఆకాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు పట్టణ అభివృద్ధి కన్నా ముందు పట్టణ ప్రజల ఆరోగ్యం ముఖ్యమని తక్షణమే ఆ మహిళల మరుగుదొడ్డ డ్రైనేజ్ పైపును చేసి ఆకాలనీ ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని లేనిపక్షంలో కాలనీ ప్రజలను మామేకం చేసి పెద్ద ఎత్తున మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం చేపడతామని వారు హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ 16వ వార్డు శాఖ కార్యదర్శి రాము, సీపీఐ నాయకులు రామాంజనేయులు, తమన్నా వీరేష్, తిమ్మయ్య, అజారుద్దీన్, రామాంజనేయులు, బాలు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పట్టాల సమస్యను పరిష్కరించాలి..సీపీఐ

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : కారల్ మార్క్స్ నగర్‌లోని పేదల ఇంటి పట్టాల సమస్యను పరిష్కరించాలని సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు కె జగన్నాథం కోరారు. సోమవారం జనార్ధన్ రావు నగర్, చదువుల రామయ్య నగర్ శాఖ సమావేశంలు నగరంలోని కారల్ మార్క్స్ నగర్‌లో నగర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ నల్లన్న అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈసమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కె.జగన్నాథం, కర్నూలు నగర కార్యదర్శి పి.రామ కృష్ణారెడ్డిలు హాజరైనారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కారల్ మార్క్స్ నగర్, జనార్ధన్‌రావునగర్, చదువుల రామయ్య నగర్ లలో ప్రజల సమస్యలు అధికంగా ఉన్నాయన్నారు.గత ప్రభుత్వ హయాంలో హౌసింగ్ డిపార్ట్మెంట్ ద్వా రా ఇల్లు కట్టుకున్న వారందరి ఇంటి పట్టాలు హౌసింగ్ కార్పొరేషన్‌లో ఉండిపోవడంతో అన్నీ సొంతఇల్లు ఉన్నప్పటికీ దానిపైన ఎలాంటి హక్కులు లేకుండా పోయిందన్నారు. హౌసింగ్ కార్పొరేషన్ వాళ్ళ పేదలకు పట్టాలు ఇవ్వకుండా ఇబ్బందులు గురి చేస్తున్నారని,తక్షణమే ఆ కాలనీ ప్రజలందరికీ ఇంటి పట్టాలు ఇవ్వాలన్నారు. ఇంటి పన్నులు, కరెంటు బిల్లులు తగ్గించాలని, అర్హులైన వారందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని, కొత్త రేషన్ కార్డు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి డి శ్రీనివాసరావు, నగర కార్యవర్గ సభ్యులు ఈశ్వర్, నాగరాజు, శాఖ కార్యదర్శి భువన కుమార్ నాగరత్నమ్మ, నాగరాజు, రంగన్న, ధరేన్న, హనుమంతు, నాగమద్ది, బాబు, ప్రజానాట్యమండలి నాయకులు మాణిక్యం, శీను, కళాధర్ మరియు శాఖ సభ్యులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-తుగ్గలి: మండల తహసీల్దార్‌గా షర్మిల విధులు నిర్వహించి బదిలీపై వెళ్లడంతో జిల్లా అధికారులు డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న నాగరాజును ఇంచార్జ్ తహసీల్దార్‌గా నియమించారు.ఇంచార్జ్ తహసీల్దార్ నాగరాజును సోమవారం మండల పరిధిలోని చెన్నంపల్లి గ్రామ టీడీపీ నాయకుడు కొటేశ్వర్‌గౌడ్, రాజేంద్రగౌడ్, రామాంజనేయులుగౌడ్‌లు మర్యాద పూర్వకంగా కలసి పులహారం వేసి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శిగా రమేష్

విశాలాంధ్ర-ఆస్పరి : ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శిగా కైరిప్పల రమేష్ ఎన్నికయ్యారు.సోమవారం కర్నూలు సీపీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఏఐవైఎఫ్ జిల్లా సమితి సమావేశంలో ఎన్నిక జరిగినట్లు రమేష్ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య వైద్యం ఉపాధి అవకాశాల కోసం నిరుద్యోగ యువతతో కలిసి పాలకవర్గాలపై సమరశీల పోరాటాల నిర్వహిస్తానన్నారు. కమ్యూనిస్టు పార్టీ జిల్లా రథసారథి సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిద్దయ్యకు, అలాగే ఏఐవైఎఫ్ రాష్ట్ర జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

జవాబుదారీతనంతో అర్జీల పరిష్కారం

విశాలాంధ్ర-కర్నూలు సిటీ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీ తనంతోపరిష్కారించాలని సంబంధిత అధికారులను నగరపాలక కమిషనర్ ఎస్.వి. రామ లింగేశ్వర్ ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయం లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమానికి 11 అర్జీలు వచ్చాయి. వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయా విభాగాల అధికారులకు కమిషనర్ ఆదేశించారు. అదేవిధంగా టిడ్కోఇళ్ళకు అనర్హులు అయినందున తాము చెల్లించిన నగదు రీఫండ్ చేయాలని పలువురు కోరారు. అలాగే ఇళ్ళు అప్పగించనందున తమ బ్యాంకు ఖాతాల్లో ప్రతినెలా నగదు కట్ అవుతున్నాయని ఫిర్యాదు చేశారు. సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ వేణుగోపాల్, ఆరోగ్యధికారి విశ్వేశ్వర రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, డీసీసీ సంధ్య, సెక్రటరీ నాగరాజు, ఆర్వో జునైద్, టిపిఆర్ఓ వెంకటలక్ష్మి, టిడ్కో అధికారి పెంచలయ్య, డీపీవో ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

పదవి బాధ్యతలు చేపట్టిన సీఐ

విశాలాంధ్ర-వెల్దుర్తి: ఎమ్మిగనూరులో విధులు నిర్వహిస్తున్న సీఐ మధుసూదన్ రావు వెల్దుర్తికి బదిలీ అయ్యారు. సోమవారం స్థానిక సీఐ కార్యాలయంలో పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.

ఉరుకుంద లో భక్తుల కోలాహలం

విశాలాంధ్ర-కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాల్లో ఒకటైన శ్రీ ఉరుకుంద(ఈరన్న) నరసింహస్వామి శ్రావణమాసం ఉత్సవాలు సోమ వారం నుండి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యా యి.ఆదివారం అమావాస్య కావడంతో భక్తులు నుండి సోమవారం వరకు వేలసంఖ్యలో మొక్కుబడులు తీర్చుకున్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మొదటి గురువారం లోపు అన్నిశాఖల అధికారులతో కలసి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తానన్నారు. నిన్నటి వరకు ఉన్న ఈవో సిహెచ్ వెంకటేష్ సెలవుపై వెళ్లారు.

ధ్వజారోహణ పూజ: శ్రావణమాసంలో భాగంగా శ్రీ నరసింహ స్వామి ఆలయంలో సోమవారం పూజా కార్యక్రమం ఈవో గురు ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు వీరప్ప స్వామి అర్చక బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రైతుగా మారిన మండల వ్యవసాయ అధికారి

విశాలాంధ్ర-హొళగుంద : మండల వ్యవసాయ అధికారి గాఉన్న ఆనంద్ లోక్‌దళ్ రైతులకు వ్యవసాయ పంటల అత్యధిక దిగుబడి, పురుగుల నివారణ, సస్యరక్షణ తో పాటు ప్రభుత్వ పథకాలు అందించడానికి కృషి చేసేవారు రైతులకు తగిన సలహా సూచనలు వ్యవసాయం లాభసాటిగా మారడానికి ఎంతో కృషి చేసేవారు. అలాగే మండలంలోని వ్యవసాయ సిబ్బందికి గ్రామ రైతులకు అందుబాటులో ఉంటూ తగినసలహా సూచనలు ఇవ్వాలంటూ ఆదే శించేవారు అయితే సోమవారం జై బసవ ఆయకట్టు పొలంలో వ్యవసాయ కూలీలు వరి నాట్లను వేస్తున్నారు. పొలానికి వెళ్లిన మండల వ్యవసాయాధికారి వెంటనే వరినారులను అందుకొని పొలాల్లో వరినాట్లు వేసి రైతుగా మా రారు. సిబ్బంది కూడా వరి నాట్లు వేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. వ్యవసా యాధికారి మాట్లాడుతూ రైతుల కష్టాలు బాగా తెలుసు నని రైతు కుటుంబం లో జన్మించానని అందుకోసమే వరి నాట్లు వేయడం తనకు ఎంతో ఇష్ట మన్నారు. రైతుగా మారి వరి నాట్లు వేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు.ఆయన వెంట ఏఈఓ విరుపాక్షి,వీఏఏ మణిశ్రీ, రైతులు బసవ, జె జంపన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఐ రాజారెడ్డిని సస్పెండ్ చేయాలి : న్యాయవాదులు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డకు చెందిన ప్రముఖ న్యాయవాది పత్తి సుబ్బరామిరెడ్డిపై నంద్యాల రెండో పట్టణ సీఐ రాజారెడ్డి దౌర్జన్యం చేయడాన్ని ఆళ్లగడ్డ న్యాయవాదులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా సోమవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మీడియా సమావేశంలో న్యాయవాది సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని విశ్వనగర్‌లో ఉన్న తమ మూడు సెంట్ల స్థలంలో ఈనెల 2న సిమెంట్ పిల్లర్లు వేసేందుకు వెళ్లిన తనపై రెండో పట్టణ సీఐ రాజారెడ్డి పనిని వెంటనే ఆపాలంటూ హుకూం జారీ చేశారన్నారు. పనులు ఎందుకు ఆపాలని కోర్టు ఆర్డర్ ఏమైనా ఉందా, తనపై కంప్లైంట్ ఏమైనా ఉందా అని ప్రశ్నించిన తనపై సీఐ రాజారెడ్డి జులుం ప్రదర్శించి కాలర్ పట్టుకొని, బలవంతంగా వాహనంలో ఎక్కించుకుని వెళ్లి గంట పాటు స్టేషన్లో నిర్బంధించడం జరిగిందన్నారు. అనంతరం తమ తోటి న్యాయవాదులు అక్కడికి రావడంతో వదిలి వేయడం జరిగిందన్నారు. నంద్యాలలోని విశ్వ నగర్‌లోని తమ అత్త పోరుమామిళ్ల పార్వతమ్మకు మూడు సెంట్లు స్థలం ఉందన్నారు. స్థలంపై కన్నేసి వివాదం చేస్తున్న బేకర్స్ పార్క్ చవ్వా మనోహర్ రెడ్డి, శరభారెడ్డి అనే వ్యక్తుల ప్రోత్సాహంతో సీఐ రాజారెడ్డి దౌర్జన్యంగా తన స్థలంలోకి ప్రవేశించి పనులను ఆపించడాన్ని న్యాయవాదులు తీవ్రంగా ఖండించారు. సీఐ రాజారెడ్డి అతనికి సహకరించిన కానిస్టేబుల్స్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని న్యాయవాది సుబ్బరామిరెడ్డి, సహచర న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నీలకంటేశ్వరం, పి.ఎస్.మహబూబ్ బాష, బి.శివ ప్రసాద్ రావు, ఎస్.రమణయ్య, టీవీ సుబ్బారెడ్డి, మురళీ ధర్ గౌడ్, పి.మురళి, రమాదేవి, మాజీ ఏజీపీ షఫ్రక్, బత్తలూరు మల్లికార్జున రెడ్డి, పడకండ్ల మల్లికార్జున రెడ్డి, విజయ్ బాబు, సుదర్శన్, వెంకటేశ్వర్లు, గణేష్, జయ చంద్రారెడ్డి, వెంకటయ్య, రమణ రావు, శ్రీనివాసులు, తిరుపేలు రెడ్డి, కమతం గుర్రెడ్డి, పామిలేటి, ఇమ్రాన్, సుబ్బయ్య, మోహన్, రవి, శ్రీనివాసులు, ఓబులేసు, బాబా వక్రుద్దిన్, దాదాపీర్, సుదర్శన్, గౌస్‌లు పాల్గొన్నారు.

హత్య కేసులో ముగ్గురు నిందితులు అరెస్టు

విశాలాంధ్ర - ఆస్పరి : ఈ నెల 28వ తేదీన చిన్న హెరాతూరు గ్రామ సమీపంలోనే బొగ్గప్ప బావి దగ్గర గుర్తు తెలియని మృతదేహాన్ని డ్రమ్ములో కుక్కి పాడవేసిన కేసులో నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్లు పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్లో పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఈ 28న చిన్నహెరాతూరు గ్రామ సమీపంలోనే బొగ్గప్ప బావి దగ్గర దారుణంగా హత్యగావించబడిన గుర్తు తెలియని మృతదేహాన్ని డ్రమ్ములో గుర్తించడం జరిగిందని, ఆ సమయంలో పోలీసులు గుర్తు తెలియని మృతదేహం కింద పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. ఈ కేసు విచారణలో భాగంగా హెరాలేబీడు గ్రామంలోని హెరాటల్ దగ్గర ముగ్గురు వ్యక్తులు బోడిబండ నరసింహుడు, తుంబళబీడు కురువ హనుమంతు, హులేబీడు పంపయ్య ఆచారి పోలీసులు చూసి పారిపోతుంటే వారిని పట్టుకొని విచారించగా మసీద్ పురం గ్రామానికి చెందిన కురువ పేటయ్య(45)ను డబ్బు కోసం హత్య చేసినట్లు నిందితులు ఒప్పుకోవడం జరిగిందన్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మసీదుపురం గ్రామానికి చెందిన కురవ పేటయ్య తనకు ఉన్న 60 సెంట్లు పొలాన్ని తన తమ్ముడుకు రూ 17.50 లక్షలకు అమ్మగా రూ 10 లక్షలు గతంలో అడ్వాన్స్‌గా ఇవ్వడం జరిగింది. మిగిలిన రూ 7.50 లక్షలు జూలై 24వ తేదీన వాళ్ల తమ్ముడు పేటయ్యకు ఇచ్చాడు. తనకు ఉన్న అప్పులకు ఈ డబ్బులు చాలావని జరిగిన విషయాలన్నీ బోడిబండ నరసింహుడు, తుంబళబీడు కురువ హనుమంతులకు పేటయ్య తెలిపారు. ఈ డబ్బుతో నకలీ నోట్లు తీసుకుంటే రెండింతల డబ్బులు వస్తాయని పెటయ్యకు పై వారు ఆశపెట్టి జూలై 25వ తేదీన పథకం ప్రకారం హులేబీడు గ్రామానికి చెందిన పంపయ్య వ్యవసాయ పొలంలో ఫుల్లుగా మద్యం సేవించి మద్యం మత్తులో ఉన్న పేటయ్య తాగుతున్న మద్యంలో సైనేట్ కలిపి బలవంతంగా తాపించడంతో అక్కడికక్కడే మరణించడం జరిగింది. విషయం బయటకు రాకుండా అక్కడే పెంట దిబ్బలో మృతదేహాన్ని పూడ్చి పెట్టారు. రెండు రోజులు తర్వాత దుర్వాసన వస్తుండటంతో ఎవరికైనా తెలుస్తుందే మోనని జూలై 28వ తేదీన ముగ్గురు కలిసి మృత దేహాన్ని పార్సిల్ చేసి ప్లాస్టిక్ డ్రమ్ములో కుక్కి ఒక ఆటోలో చిన్నహెరాతూరు ఆస్పరి రైల్వే గేట్ మధ్యలో ఉన్న బొగ్గప్ప బావి దగ్గర డ్రమ్ము పారవేసి ఆటోలో వెళ్లిపోవడం జరిగింది.

తహసీల్దార్‌గా పదవీ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : మండల తహసీల్దార్‌గా జ్యోతి రత్న కుమారి సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ తహసిల్దారుగా పని చేసిన నజీర్ అహ్మద్ బదిలీ అయ్యారు. నూతన తహసిల్దార్ జ్యోతి రత్నకుమారికి రెవెన్యూ అధికారులు, సిబ్బంది స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో కలసి కట్టుగా పనిచేస్తామని ప్రజలకు రెవెన్యూ సేవలు ఎల్లవేళలా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఎమ్మెల్యే అఖిల ప్రియాను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన తహసిల్దార్లు : నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో నూతన తహసిల్దార్లు సోమవారం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను మర్యాదపూర్వకంగా కలిసి ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆళ్లగడ్డ, రుద్రవరం, సిరివెళ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, చాగలమర్రి తహసీల్దార్లు జ్యోతి రత్నకుమారి, మల్లికార్జున రావు, పుష్ప కుమారి, ఎం.శ్రీనివాసులు, సుభద్ర, రవికుమార్‌లు ఉన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి ఓపీ విధానం మార్చాలి

విశాలాంధ్ర - బనగానపల్లె: ప్రభుత్వ ఆసుపత్రి ఓపీ విధానం మార్పు చేయాలని నంద్యాల జిల్లా గిరిజన సమైక్య అధ్యక్షుడు కాలింగ రాముడు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో పేషెంట్లు ఓపీ రాయించుకోవాలనుకుంటే మొబైల్ స్మార్ట్ ఫోన్‌లో యాప్ ఎక్కించుకోవాలి అనే విషయంలో హాస్పటల్ సిబ్బంది చాలా ఆలస్యం చేస్తున్నారని, క్యూ లైన్‌లో ఓపీలో రాస్తూ మరొక రూమ్‌లో, పేరు వయస్సు ఓపీపై నమోదు చేస్తున్నారన్నారు. ఈ విధంగా చేయటం వల్ల పేషెంట్లు గందరగోళానికి గురవుతూ క్యూ లైన్‌లో నిలబడి డాక్టర్ దగ్గరికి వెళ్తే అక్కడ సీరియల్ అని చెప్పి రిటర్న్ పంపిస్తున్నారని, ఓపీలోనే పేరు, వయసు, రోగం, రూమ్ నెంబర్‌లో డాక్టర్ దగ్గరికి వెళ్ళాలో సూచనలు చేయవలసిందిగా ఆస్పత్రి సూపర్డెంట్ మార్పు చేయాలని కోరారు.

విద్యార్థుల క్రీడా పరికరాలకు ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివే విద్యార్థుల క్రీడా పరికరాలకు తాలూకా టిడిపి నాయకులు, కాటన్ బోర్డు మాజీ డైరెక్టర్ చింతకుంట శ్రీనివాసరెడ్డి ఆర్థిక సాయం అందించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు క్రికెట్ కిట్ మరియు బాలికలకు షటిల్ బ్యాడ్మింటన్ బ్యాట్స్‌కు రూ.11 వేల విరాళం అందించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ డా.సి.గంగన్న మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంచి నైపుణ్యం కలిగిన అధ్యాపకులు ఉన్నారని, విద్యార్థులు తమ కళాశాలలో చేరాలని ఆయన కోరారు. విద్యతో పాటు క్రీడలు ఆడేందుకు మంచి మైదానం ఉందన్నారు. కొంతమంది దాతలు డిగ్రీ కళాశాలకు కంప్యూటర్లు, కుర్చీలు, డెస్కులు, బీరువాలు ఇవ్వడం జరిగిందన్నారు. విద్యార్థులకు ఆర్థిక సాయం అందించిన సీపీ శ్రీనివాసరెడ్డికి కళాశాల ప్రిన్సిపాల్ డా.శివరామయ్య, వైస్ ప్రిన్సిపాల్ గంగన్న, అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు న్యాయమైంది కాదు

విశాలాంధ్ర - నంద్యాల రూరల్: సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు న్యాయమైనది కాదని, వర్గీకరణ చేస్తే రాష్ట్రవ్యాప్తంగా మాల మహానాడు ఆధ్వర్యంలో వివిధ రూపాలలో ఉద్యమాలు చేపట్టేందుకు తగ్గేదే లేదని మాల మహానాడు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మేకల లింగస్వామి, రాష్ట్ర అధ్యక్షులు కొప్పెర చెన్నయ్యలు అన్నారు. సోమవారం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ స్థానిక కలెక్టరేట్ కార్యాలయం నందు మాల మహానాడు జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2004 నవంబర్‌లో సుప్రీంకోర్టు ఇచ్చిన ధర్మాసనం తీర్పు ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగంలోని 341 ఆర్టికల్‌ను మాత్రమే సవరించి వర్గీకరణ చేయవలసి ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణ అన్నది రాజ్యాంగంలోని 341ఆర్టికల్‌కు వ్యతిరేకం అయితే ఎస్సీ వర్గీకరణకు సరైన పరిష్కారం రాజ్యాంగంలోని 341 ఆర్టికల్ మాత్రమే సూచిస్తుందని తెలిపారు. 341 ఆర్టికల్ అనుసరించకుండా ఎస్సీ వర్గీకరణ చేయడం న్యాయ సమ్మతంగా లేదన్నారు. ఇతర రాష్ట్రంలో చమ్మర్లు, మాదిగ వర్గీయులు రాజ్యాంగంలోని 341 ఆర్టికల్ ద్వారా అత్యధిక లబ్ధి పొందుతున్నారు. మాల మాదిగలలో సామాజిక ఆర్థిక అంతరాలు ఉన్నది వాస్తవమే అయితే ఈ సామాజిక ఆర్థిక అంతరాలు సమసి పోవాలంటే రాజ్యాంగం సూచించిన విధంగా పార్లమెంట్లో చట్టం చేయవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పార్లమెంటు ద్వారా సూచించే చట్టమే సరైన మార్గం కానీ సుప్రీం కోర్టులోని ధర్మాసనం సూచించిన తీర్పు న్యాయ వంతం కాదన్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మాలలు మాదిగల్లో సరైన సామాజిక ఆర్థిక అంతరాలు తొలగాలంటే శాశ్వత పరిష్కారము కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చూపించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒక నిర్ణయం తీసుకొని మాలలకు మాదిగలకు అంతరాలు కలుగకుండా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు. మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లం రాజకుమార్ ఉపాధ్యక్షులు పేరుమాల్ల రాముడు రాజశేఖర్, నంద్యాల జిల్లా అధ్యక్షులు అన్నపురెడ్డి దేవదాస్, రాష్ట్రం మహిళా నాయకురాలు గుర్రం లక్ష్మి మాల మహానాడు రాయలసీమ అధ్యక్షులు మేకల వెంకట్, నంద్యాల ఉపాధ్యక్షుడు దామ రేకుల ఇసాక్, రవి, ఆత్మకూరు మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లె ఎలిషా, మాల మహానాడు ఆత్మకూర్ తాలూకా ఉపాధ్యక్షులు పెరుమాళ్ళ కేశవులు, ఆత్మకూరు తాలూకా అధ్యక్షులు చింతలయ్య, ఉపాధ్యక్షులు భీమర్జున పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు స్వయం ప్రతిపత్తిని హరించేందుకు కేంద్రం కుట్ర

విశాలాంధ్ర - కర్నూలు జిల్లా పరిషత్ : వక్ఫ్ బోర్డు స్వయం ప్రతిపత్తిని హరించేందుకు మోడీ ప్రభుత్వం కుట్ర పన్నుతుందని జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ నవీద్ విమర్శించారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ మైనార్టీ నాయకులతో సమావేశమై నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ముస్లింలను రెండవ తరగతి పౌరులుగా మార్చేందుకు కుట్ర చేస్తుందని హిందుత్వ ఎజెండాలో భాగంగా ముస్లింల భూ యాజమాన్య హక్కులను హరించేందుకు సిద్ధమైందని విమర్శించారు. ఇందుకోసం వక్ఫ్ బోర్డులపై గురి పెట్టిందని దేశంలోని వక్ఫ్ బోర్డు ఆస్తుల స్వాధీనానికి కుతంత్రాలు చేస్తుందని ఇందులో భాగంగానె వక్ఫ్ ఆస్తుల ధ్రువీకరణ నిర్ధారణ బోర్డుల అధికారాలను కుదించేందుకు వక్ఫ్ చట్టానికి 40 సవరణలను ప్రతిపాదించిందని ఇందుకు కేంద్ర క్యాబినెట్ శుక్రవారం ఆమోదం తెలిపిందని దీంతో త్వరలోనే పార్లమెంటులో సవరిత చట్టాన్ని ప్రతిపాదించనున్నారని తెలిపారు. ఇకపై వక్ఫ్ ఆస్తులను తమ సొంతవిగా చెప్పుకునేందుకు వీలు లేకుండా చట్టాన్ని మోడీ ప్రభుత్వం సవరిస్తుందని సయ్యద్ నవీద్ తెలియజేశారు. అనంతరం సిటీ మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు ఆస్తుల పర్యవేక్షణలో జిల్లా మెజిస్ట్రేట్లకు అధికారాలు ఇవ్వాలని భావిస్తుందని కేంద్ర వక్ఫ్ మండలి, రాష్ట్ర వక్ఫ్ బోర్డులో మహిళా ప్రాతినిధ్యం పెంచే నెపంతో సంబంధిత చట్టాన్ని సంస్కరించేందుకు మోడీ ప్రభుత్వం పూనుకుందని సవరణ బిల్లుకు ఆమోదం లభిస్తే గనుక ఏ ఆస్తిని కూడా తమ సొంత ఆస్తిగా చెప్పుకునేందుకు వక్ఫ్ బోర్డుకు అధికారం ఉండదు. ప్రతిపాదిత సవరణల ప్రకారం వక్ఫ్ బోర్డు ఆస్తుల నిర్ధారణ తప్పనిసరి అవుతుంది. దేశవ్యాప్తంగా ముస్లింల కోసం ఓ వ్యక్తి అందజేసే స్థలం లేక ఆస్తిని నియంత్రించేందుకు వక్ఫ్ చట్టం అమల్లోకి వచ్చింది. గత యూపీఏ ప్రభుత్వ హయాంలో వక్ఫ్ చట్టం కింద అదనపు అధికారాలను కల్పించారు. కానీ ప్రస్తుతం మోడీ ప్రభుత్వం వక్ఫ్ బోర్డు నిర్వీర్యానికి కసరత్తు చేస్తుందని ఆస్తుల దుర్వినియోగాన్ని నివారించేందుకు దేశవ్యాప్తంగా ఉన్న 30 వక్ఫ్ బోర్డులు ఉన్నాయని తెలియజేశారు. ఇప్పటికైనా ప్రధానమంత్రి మోడీ ఈ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు రియాజుద్దీన్ మైనార్టీ సెల్ సిటీ అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు ఎన్సీ బజారన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఈ లాజరస్, డిసిసి కార్యదర్శి అబ్దుల్ హై మొదలవారు పాల్గొన్నారు.

దేవాదాయ భూములు పరిరక్షించాలి

విశాలాంధ్ర -కల్లూరు: బీజేపీ మండల అధ్యక్షుడు సోమయాచారి ఆధ్వర్యంలో కల్లూరు మండలం పరిధి ఏ గోకులపాడు కింది మఠం భూమి సర్వే నెంబర్ 87లో 10 ఎకరాల భూమిని కొందరు వ్యక్తులు తప్పుడు రిజిస్ట్రేషన్ చేసి అమ్ముకోవడం జరిగిందని, దీనిపై విచారణ జరిపించి రక్షించాలని భారతీయత పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బీజేపీ నాయకులు సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఏ గోగులపాడు గ్రామంలో 70 ఏళ్ల నాటి భూమి గతంలో పూజారికి గుడికి ధూప దీప నైవేద్యానికి పూర్వం గ్రామ పెద్దలు ఇవ్వడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో ఈ భూమిని కబ్జా చేసి ఇద్దరు ముగ్గురు చేతులు మారి అమ్మేసుకున్నారన్నారు. బీజేపీ నాయకులు జిల్లా చామకూర వీరప్ప, ఓబీసీ మోర్చా స్టేట్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ హేమ, సుందర్ రెడ్డి, కిషన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు తారకేశ్వర్ రెడ్డి, మదనమోహన్ ఆచారి, బీకే రవికుమార్, పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

విశాలాంధ్ర- మంత్రాలయం: మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామ పరిధిలో ఏపీ మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని కె.పార్వతి ఆత్మహత్య వెనుక అనుమానాలు ఉన్నాయని, ఈ ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేపట్టాలని నియోజకవర్గ కార్యదర్శి విజయ్ భాస్కర్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరించి విద్యార్థి మృతికి కారణమైన ప్రిన్సిపాల్, వార్డెన్లపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. హాస్టల్లో ఉన్న సీసీ కెమెరాలు రాత్రి వరకు పనిచేసి, ఉదయం అయ్యే సరికి పని చేయ లేదని చెప్పడం పలు అనుమానాలకు తావిస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటిం చాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరోసారి ఇలాంటి ఘోర సంఘటనలు పునరావృతం చర్యలు చేపట్టాలని కోరారు.

తహసీల్దార్‌గా శ్రీనాథ్ బాధ్యతలు

విశాలాంధ్ర-పెద్దకడబూరు : మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం కొత్తగా తహసీల్దార్‌గా శ్రీనాథ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ మహేష్, ఆర్ఐ మహేష్, మండల సర్వేయర్ తేజస్విని, ఏఎస్ఓ వెంకటేశ్వర్లు, వీఆర్వోలు నారాయణ రెడ్డి, కృష్ణమూర్తి, సురేష్, నరసప్ప తదితరులు బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొత్త తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీనాథ్ మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా మండలంలో భూ సమస్యలతో రైతులు తహసీల్దార్ కార్యాలయానికి వస్తున్నారని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్

విశాలాంధ్ర -క్రిష్ణగిరి: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా చిత్తూరు జిల్లాలో నగిరిలో పనిచేస్తున్న చంద్రశేఖరను కర్నూలు జిల్లాకు బదిలీ చేయగా జిల్లా అధికారుల ఆదేశాలతో క్రిష్ణగిరి తహసీల్దారుగా దేవా చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దారు అనురాధ కడప జిల్లాకు వెళ్లిపోవడంతో వారి స్థానంలో తాసిల్దార్ చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దారు పాత్రికేయులతో మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో మంత్రాలయం, నందవరం తదితర మండలాల్లో తాసిల్దార్ గా పనిచేశానని ఆయన తెలిపారు. రెవెన్యూ సంస్థలపై ఏమైనా ఫిర్యాదులు వస్తే సాధ్యమైనంతవరకు వెంటనే పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. రెవెన్యూ సిబ్బంది ప్రజలకి చేరువగా ఉంటూ విధుల పట్ల అలసత్వం

తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన కుమారస్వామి

గోనెగండ్లలో: గోనెగండ్ల మండలానికి నూతన తహశీల్దార్ కె.కుమార స్వామి బాధ్యతలు స్వీకరించారు. ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ్ శర్మను పుష్ప గుచ్ఛంతో అందజేసి, మర్యాద పూర్వకంగా కలిసి నూతన తహశీల్దార్ కె.కుమార స్వామి జాయినింగ్ రిపోర్ట్ చేశారు. తహసీల్దార్ కుమార స్వామి మాట్లాడుతూ మండలంలో ఏమైనా భూ సమస్యలు, ఇతర సమస్యలు వుంటే తమ దృష్టికి తీసుకోని రావాలని కోరారు.

నాటుసారా సీజ్, వ్యక్తి అరెస్టు

విశాలాంధ్ర-కోడుమూరు : జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశాల మేరకు ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ ఎస్.రవికుమార్ పర్యవేక్షణలో కోడుమూరు సెబ్ పోలీసులు నాటుసారా స్థావరాలపై విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నారు. సోమవారం సెబ్‌అధికారులు నిర్వహించిన దాడుల్లో కృష్ణగిరి మండలంలోని చిట్యాలలో అడవి మాదన్న వద్ద నుంచి 15 లీటర్లు నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ రామాంజ నేయులు తెలిపారు. అక్రమంగా నాటుసారా నిల్వ ఉంచిన అడవి మాదన్నపై కేసు నమోదు చేసి డోన్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా 14రోజులు రిమాండ్ విధించినట్లు ఆయన పేర్కొన్నారు. దీంతో నిందితుడిని డోన్ సబ్ జైలుకు తరలించినట్లు సీఐ తెలియజేశారు. ఈ దాడులలో కోడుమూరు సెబ్‌స్టేషన్ ఎస్సై అలిబేగ్, సిబ్బంది అన్వార్‌బాషా, విరుపాక్షిరెడ్డి, శంకర్ నాయక్, సువర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఆరుగురు అరెస్ట్

విశాలాంధ్ర -కర్నూలు క్రైం : కర్నూలు ట్రాఫిక్ పీఎస్, సీఐ పి.గౌతమి ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్లో పట్టుబడిన ఆరు గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. పట్టుబడ్డ వారిని సోమవారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కర్నూలు ఎదుట హాజరు పరచగా మూడురోజులు రిమాండుకు ఆదేశించినట్లు తెలిపారు. మేజిస్ట్రేట్ ఉత్తర్వుల మేరకు జిల్లా జైలుకు తరలించినట్లు ట్రాఫిక్ పోలీస్‌లు తెలిపారు.

అక్రమ మద్యం రావాణాపై గట్టి నిఘా

విశాలాంధ్ర-ఆదోని రూరల్: కర్ణాటక అక్రమ మద్యం రవాణాపై చెప్పు పోలీసులు గట్టి నిగా ఉంచారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు ఎన్ఫోర్స్మెంట్ సూపర్డెంట్ రవికుమార్ పర్యవేక్షణలో సోమవారం మండలంలోని వానవాళ్లు గ్రామ బ్రిడ్జి వద్ద ఓ వ్యక్తి కర్ణాటక టెట్రా ప్యాకెట్లు ద్విచక్ర వాహనంపై 12 బాక్సులు సరఫరా చేస్తుండగా సబ్ పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన అక్రమ మద్యాన్ని, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. పట్టుబడిన అక్రమ మద్యం విలువ సుమారు రూ,,50 వేలు ఉంటుందని మీడియాకు తెలిపారు.

వినతులు స్వీకరించిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తులను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు చిరంజీవి, విశ్వనాథ్, నాగ ప్రసన్న లక్ష్మి స్వీకరించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తులను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు స్వీకరిస్తూ వాటికి తగిన పరిష్కారం చూపాల్సిందిగా సంబంధిత అధికారులకు సూచించారు. అదే విధంగా పరిష్కారం అయిన అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించండి

విశాలాంధ్ర-వెల్దుర్తి: మండల పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లి గ్రామంలో కుటుంబ వైద్య విధానం కార్యక్రమంలో భాగంగా బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారిని హేమలత, మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల ,అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించినారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని. ప్రజలు పరిసరాల పరిశుభ్రతస్వీయ పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు ఆశలు సీజనల్ వ్యాధులు కేంద్రులకు తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు సూచనలు ఇవ్వాలని తెలిపారు. ప్రతిరోజు భోజనానికి ముందు మలవిసర్జన తరువాత చేతులు సబ్బుతో శుభ్రం చేసుకునేటట్లు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఎక్కడైనా గ్రామంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, అతిసాల, కేసులు గుర్తిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. విష జ్వరాలతో కాకుండా ప్రతి ఒక్కరూ దోమల నియంత్రణకు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత అలవర్చు కోవాలన్నారు. డెంగ్యూ, మలేరియా, వంటి వ్యాధులు పరవలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల నివారణకు ,నీటి నిలువలు లేకుండా చూసుకునేలా ప్రజలను పూర్తిస్థాయిలో చైతన్యం పెంచాలన్నారు. హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలను అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదు

విశాలాంధ్ర-ఆదోని : చట్టాలను అతిక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఆదోని వన్ టౌన్ సీఐ శ్రీరామ్ హెచ్చరించారు. బదిలీపై తిరుపతి రెడ్ శాండిల్ ఫోర్స్ నుండి ఆదోని వన్టౌన్ సీఐ గా సోమవారం బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలందరికీ 24 గంటలు అందుబాటులో ఉంటానని, సామాన్యులు నేరుగా ఎవరికి భయపడకుండా ధైర్యంగా స్టేషన్కు రావచ్చన్నారు. మట్కా, బెట్టింగ్, గ్యాంబ్లింగ్, నాటు సారాయి, కర్ణాటక మద్యం అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. సమాచారం వస్తే దొంగ బంగారం వ్యాపారులను సైతం వదిలిపెట్టి ప్రసక్తి లేదని అన్నారు . అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే అందరూ వాటిని మానుకోవాలని సూచించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వ్యాపారులు తమ తమ స్థానాల్లో వ్యాపార సముదాయాలు నడుపుకోవాలని సూచించారు. 2007 బ్యాచ్ ఎస్సైగా ఉద్యోగం పొంది అనంతపూర్ , కడప జిల్లాలో పనిచేసి 2018లో సీఐగా పదోన్నతి పొంది ఆదోని త్రీ టౌన్, కర్నూల్ తాలూకా, అనంతపురం, తిరుపతి లో విధులు నిర్వహించి బదిలీపై ఆదోనికి వచ్చారు. పోలీసులకు ప్రజలందరూ సహకరించాలని, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. సిఐకు పట్టణంలోని యువకులు ప్రజాసంఘాల నాయకులు, పుష్పగుచ్చాలు అందజేసి కలిశారు.

ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి : జిల్లా రెవెన్యూ అధికారి

విశాలాంధ్ర - నంద్యాల: ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎ.పద్మజ జిల్లాధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం కార్యక్రమంలో పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి పద్మజ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపాల న్నారు. జిల్లాలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసు కోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తిపరిచేలా చూడాలని ఆమె అధికారులను సూచించారు. పారిశుధ్యానికి టోల్ ఫ్రీ నెం.7993812160 అని, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని డీఆర్వో ఎ.పద్మజ, డీపీవో మంజులవాణి, పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. స్వచ్ఛభారత్ - స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టి పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మురికి కాల్వలను పరిశుభ్రం చేస్తూ డ్రైనేజీ వ్యవస్థను చక్కగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించి క్లోరినేట్ చేసిన నీటినే సరఫరా చేయాలన్నారు. గ్రామీణాభివృద్ధిని సామాజిక బాధ్యతగా తీసుకొని పనులు చేపట్టాలన్నారు. పారిశుద్యానికి సంబంధించి జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలపై టోల్ ఫ్రీ నెంబర్ 79938-12160 ఫోన్ చేసి పారిశుద్ధ్య సమస్యలపై ఫిర్యాదులు ఇవ్వచ్చన్నారు.

ఈ-పంట నమోదు క్షేత్రస్థాయి పరిశీలన

విశాలాంధ్ర- వెలుగోదు : మండలంలోని మోత్కూరు, వెలుగోదు గ్రామంలో ఖరీఫ్ 2024లో సాగు చేసిన రైతు పొలా లను, వెలుగోదు మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ రైతు సేవా కేంద్రం సిబ్బందితో క్షేత్రస్థాయిలో ఈ-పంట నమోదుని సోమవారం పరిశీలించారు. ఈ-పంట నమోదు వెబ్‌ల్యాండ్, సీసీఆర్సీ డేటాతో యాప్‌ను అనుసంధానించినందున, రైతు ఆధార్ నెంబర్ నమోదు చేయగానే సర్వే నంబర్లవారీగా భూముల వివరాలు తెలుస్తాయి. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఏ సర్వే నెంబర్ పరిధిలో ఏ రకం పంటను ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారో యాప్‌లో వివరాలు నమోదు చేస్తారు. ఆ తర్వాత వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ, సర్వే సహాయకులతో కలిసి రోజూ కనీసం 50 ఎకరాలకు తక్కువ కాకుండా క్షేత్ర స్థాయిలో పరిశీలన చేపడతారు. యాప్‌లో నమోదైన వివరాలతో సరి పోల్చుకుని జియో కో ఆర్డినేట్స్‌తో సహా పంటల ఫోటోలు తీసి అప్‌లోడ్ చేస్తారు. అనంతరం యాప్‌లో నమోదు చేసిన వివరాలన్నీ తెలియచేసి రైతు వేలిముద్ర తీసుకోగానే యాప్ ద్వారానే సంబంధిత ఫోన్ నెంబర్‌కు డిజిటల్ రసీదు జారీ అవుతుందని ఏవో పవన్ కుమార్ తెలిపారు.

మందుబాబుల పని పడతాం : సీఐ

విశాలాంధ్ర - నంద్యాల రూరల్: నంద్యాల తాలూకా పరిధి గ్రామాలలో మందుబాబులు తాగిన మైకంలో అసాంఘిక కార్య క్రమాలకు పాల్పడి దాడులకు పాల్పడితే తగిన గుణపాఠం చెప్పి, మందుబాబుల పని పడతామని నంద్యాల తాలూకా సీఐ దస్తగిరి బాబు హెచ్చరించారు. సోమవారం అయిన విలేకరులతో మాట్లాడుతూ నంద్యాల ఎస్పీ ఆదిరాజ్ నాథ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు పూర్తిగా రౌడీ షీటర్లపై మందుబాబులపై నిఘ ఉంచామన్నారు. ప్రధానంగా ఇటీవల ఎస్‌డీఆర్ స్కూల్ సమీపంలో జరిగిన సంఘటనను దృష్టిలో ఉంచుకొని కేసులు పెట్టడం జరిగిందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్కూల్ నందు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. రాత్రి వేళల్లో తిరిగే వ్యక్తులపై నిఘా ఉంచి అలాంటి వారిని తాట తీస్తామని నంద్యాల తాలూకా సిఐ దస్తగిరి బాబు హెచ్చరించారు. ముఖ్యంగా శివారు ప్రాంత ములలో అసాంఘిక శక్తుల అట కట్టిస్తామని సీఐ తెలిపారు. మందు బాబులు రౌడీ మూక కదలికలపై నిఘా ఉంచామన్నారు. జిల్లా ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రానా ఆదేశాల మేరకు నిఘా ను పటిష్టం చేశామన్నారు.